క్లుప్తంగా

శనగల బసవన్నకు పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. అనంతరం నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

కుమారస్వామికి ..



భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్య స్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీడీ

పాములపాడు: స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. మంగళవారం విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ కె.సాయికృష్ణతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన అండర్-19 ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో యం.జీవన్‌కుమార్, క్రికెట్‌లో ఏ.జయంత్ ఆచారి, బాల్‌బ్యాడ్మింటన్‌లో కె.ప్రణయ్, యం. సందీప్, పి.ప్రసన్నలక్ష్మి, త్రోబాల్‌లో యం.ఈశ్వర్, ఏ.అశోక్, క్యారమ్స్‌లో కె.సంతోష్, ఈశ్వరయ్య, షటిల్‌లో కె.ప్రణయ్, యం.సందీప్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు.

వాడాల మాజీ సర్పంచ్ మృతి



మాజీ సర్పంచ్ చిన్న శీలారెడ్డి (ఫైల్)

పాములపాడు: మండలంలోని వాడాల గ్రామ మాజీ సర్పంచ్ చిన్న శీలారెడ్డి (85) మంగళవారం మృతి చెందారు. ఆయన 1980 నుంచి 1993 వరకు సర్పంచ్‌గా కొనసాగారు. 2002-2004 వరకు ఆత్మకూర్ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. కర్నూలు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మౌలాలి

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద జిల్లా పరిషత్ పాఠశాల క్రీడాకారులకు బ్రాహ్మణకొట్కూరు హాజీకరీం బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మౌలాలి మంగళవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటస్వామి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

నందికొట్కూరు: పట్టణాభివృద్ధికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే జయసూర్య కోరారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన రహదారిపై డివైడర్ నిర్మాణం కోసం రూ.3 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్‌కు స్థల పరిశీలన చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బేబి, టీపీఓ రంగస్వామి, మేనేజర్ లత, డీఈ నాసీర్, ఏఈ దినేష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరిదేవి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలరు నాయబ్, కృష్ణ, రవూఫ్, సురేష్ పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం చేసే కుట్ర

- అమాయకుల ప్రాణాలు తీస్తున్న నకిలీ మద్యం
- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది / బండిఆత్మకూరు: రాష్ట్రంలోని పేదలకు వైద్య విద్యను దూరం చేయాలనే దుర్బుద్ధితోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుట్రపన్నారని, విద్యా, వైద్య వ్యవస్థలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని శ్రీశైలం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. నంద్యాలలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం మహానంది, బండిఆత్మకూరు మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. మెడికల్ కాలేజీల నిర్వహణకు సర్కారు వద్ద డబ్బు లేదని సాకు చూపి పీపీపీ విధానం పేరిట కూటమి నేతలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఏడాదిన్నరలోనే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. పీపీపీ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అమాయకుల ప్రాణాలు తీస్తున్న నకిలీ మద్యం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుయాయులు తయారు చేస్తున్న నకిలీ మద్యం పేదల ప్రాణాలు తీసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ మద్యం తాగి మృతి చెందిన వారివన్నీ ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. నకిలీ మద్యం తయారీపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రాజం రెడ్డి సుజాతమ్మ, పార్టీ నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, మహానంది, బండిఆత్మకూరు మండలాల అధ్యక్షులు కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, బారెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం స్టేట్ సెక్రటరీ కొండా మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఏవీ కృష్ణారెడ్డి, ఇంటెలెక్చువల్ ఫోరమ్ నియోజకవర్గ అధ్యక్షులు ఇటిక్యాల చిన్న సుబ్బారెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల రమణ, వ్యవసాయ విభాగం మండల అధ్యక్షులు పల్లె మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, సర్పంచులు సుదర్శనం, ప్రతాప్‌రెడ్డి, ఒంటెద్దు వీరారెడ్డి, రైతు విభాగం నాయకులు సాగేశ్వరరెడ్డి, అశోక్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో లాభసాటి వ్యవసాయం



రైతులకు శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

వెలుగోడు: యాజమాన్య పద్ధతులను పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని కేవీకే సీనియర్ సైంటిస్ట్ ధనలక్ష్మి సూచించారు. మండలంలోని రైతులకు భూసార పరీక్షలు, ఎరువుల వినియోగంపై యాగంటి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేవీకే సీనియర్ సైంటిస్ట్ ధనలక్ష్మి మాట్లాడుతూ రైతులు ఎరువులు, పురుగు మందులను విచక్షణా రహితంగా వాడడం వల్ల నేల, గాలి, నీటి కాలుష్యం ఏర్పడి సాగు ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గిపోయిందన్నారు. ప్రస్తుత పరిస్థితులపై రైతులు అవగాహన కలిగి రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించి వ్యవసాయాధికారుల సిఫారసు మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. సైంటిస్ట్ బాలరాజ్ మట్టి నమూనా తీసే విధానం, మట్టి పరీక్షా ఫలితాలను అనుసరించి ఎరువుల వాడకం, సమస్యాత్మక భూముల యాజమాన్యం గురించి వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం గురించి తెలుగులో ప్రచురించిన కరదీపికలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ స్వాతి, డీఆర్‌సీ ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

అధ్యాపకుడిపై చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఆత్మకూరు: విద్యార్థులను అవమానకరంగా, తీవ్రంగా దుర్భాషలాడిన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ డిపార్ట్‌మెంట్ జీఎఫ్‌సీ లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు జునైద్‌బాషా, ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి ఎస్.నాగార్జున, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాజా, ఉపాధ్యక్షుడు దినేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు జ్ఞానం పంచాల్సిన లెక్చరర్ అజ్ఞానిలా, అనాగరికుడిలా ప్రవర్తించడం బాధాకరమన్నారు. గతంలో కూడా విద్యార్థులు లెక్చరర్ ప్రవర్తనపై ఫిర్యాదులు చేసినా అతడిపై చర్యలు తీసుకోకపోవడంతోనే పునరావృతమైందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సుంకన్నకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు సాయితేజ, జగదీష్, వెంకటేష్, సుజాతసాయి, వర్ధన్, రామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు చదువులో రాణించాలి



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: బాలికలు చదువులో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ సూచించారు. ముసలిమడుగు, శివపురం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని ఉన్నత స్థానాలు చేరుకోవాలన్నారు. అనంతరం బాలల హక్కులు, పర్యవేక్షణ, లింగ సమానత్వం, సైబర్ నేరాలు, క్యూఆర్ భద్రత, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపైన అవగాహన కల్పించారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కొత్తపల్లి: మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 4 వేల హెక్టార్ల దాక రైతులు మొక్కజొన్న సాగుచేశారన్నారు. కోతలు కోసి కుప్ప నూర్చుకుని ధాన్యాన్ని అమ్ముకొనేందుకు సిద్ధంగా ఉన్నా.. దళారులు క్వింటా రూ.1800 నుంచి రూ.1900లోపే అడుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2400 క్వింటాలుకు కేటాయించిందని, కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

బండి ఆత్మకూరు: వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో మంగళవారం 16.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. వర్షానికి నేలకొరిగిన వరిపైర్లను జడలు కట్టి కాపాడుకోవాలని ఆయన సూచించారు.

బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు ఉంది

- మంత్రి పయ్యావుల కేశవ్
- ప్రధాని పర్యటించే ప్రదేశాలను పరిశీలించిన మంత్రులు

శ్రీశైలంటెంపుల్: ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించనున్న బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. మంగళవారం శ్రీశైలం చేరుకున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రులు మీడియాతో మాట్లాడారు. ప్రధాని రాకతో శ్రీశైల ప్రాశస్త్యం, ప్రాచుర్యం పెరుగుతుందన్నారు. అటవీశాఖ అడ్డంకులతో వసతులు కల్పించలేని పరిస్థితి ఉన్న నేపథ్యంలో ఆ సమస్యకు కూడా ప్రధాని రాకతో పరిష్కారం లభిస్తుందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం మంత్రులు ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. వీరి వెంట శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఉన్నారు.

విలువలతో కూడిన విద్యాబోధన చేయాలి

మహానంది: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యాబోధన చేయాలని జిల్లా సర్వశిక్ష అభియాన్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మాధవిలత ఉపాధ్యాయులకు సూచించారు. తిమ్మాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఏ-2 పరీక్షలను మంగళవారం పరిశీలించారు. రానున్న పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం చింతకుంట్ల చంద్రశేఖర్‌రెడ్డి పాఠశాలలో నెలకొన్న సమస్యలను మానిటరింగ్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లారు.

అలరించిన భక్తి గీతాలు



భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన రత్నమ్మ, జమున్న వారి బృందాలచే భజన కార్యక్రమం నిర్వహించారు. శుక్లాం భరదరం, శివశంభో, వరాల దేవుడయ్యా, లింగాష్టకం, శ్రీశైల శివమయం, శివ శివ శంకరా, అమ్మా భ్రమరాంబాదేవి, కనరండి కనరండి శ్రీశైలం తదితర భక్తిగీతాలను, భజనకీర్తనలను కాశీవిశ్వనాథ్, శ్రీనివాసులు, శివ, రత్నమ్మ, గోపాలకృష్ణ, మహేష్ ఆలపించారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

శిరివెళ్ల: గుంప్రమాన్‌దిన్నెకు చెందిన డిగ్రీ విద్యార్థిని వెన్నెల (17) అదృశ్యమైనట్లు ఎస్ఐ చిన్న పీరయ్య మంగళవారం తెలిపారు. ఆమె నంద్యాలలోని ఓ కాలేజీ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఇటీవల దసరా సెలవులు రావడంతో ఇంటికి వచ్చింది. ఈ నెల 13వ తేదీ ఇంటిలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఓ ఉపాధ్యాయుడు...ముగ్గురు విద్యార్థులు

- పారుమంచాల
బైరెడ్డినగర్ ఫౌండేషన్ స్కూల్ దుస్థితి




కేవలం ముగ్గురు విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు షాహిద్‌బాషా

జూపాడుబంగ్లా: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యావ్యవస్థను అన్నివిధాలుగా తీర్చిదిద్ది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను ప్రసాదించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠశాలలను నిర్వీర్యం చేసిందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2కిలోమీటర్ల దూరంలోని ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ స్కూళ్లుగా మార్చారు. ప్రాథమిక పాఠశాలల్లో అరకొరగా ఉన్న విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయటంతో ఫౌండేషన్ స్కూళ్లల్లో విద్యార్థులేకపోవటంతో ఉన్న ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు బదిలీ చేశారు. మండలంలోని పారుమంచాల గ్రామంలోని బైరెడ్డినగర్‌కాలనీ లోని ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీపంలోని ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. దీంతో పాఠశాలలో ప్రస్తుతం ఒకటో తరగతిలో ఒకరు, రెండో తరగతిలో ఇద్దరు మొత్తం ముగ్గురు విద్యార్థులు మాత్రమే విద్యను అభ్యసిస్తున్నారు. వారికి విద్యాబోధన చేసేందుకు ఓ ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు. తమ కాలనీ గ్రామానికి సుమారు 2కిలోమీటర్ల దూరం ఉన్నందున ఉన్నత పాఠశాలలో విలీనం చేసిన తమ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులను వెనక్కి రప్పించి 1 నుంచి 5 తరగతుల వరకు యథావిధిగా కొనసాగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని చిన్నకందుకూరు రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయలక్ష్మీ (60) అనే మహిళ మృతి చెందారు. నంద్యాల బొమ్మలసత్రం కాలనీకి చెందిన విజయలక్ష్మి పెద్ద ముడియం మండలం పాలూరు గ్రామంలో ఉన్న పెద్దమ్మ మృతి చెందడంతో అక్కడికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో తమ్ముడు ఏవీ సుబ్బారెడ్డితో కలిసి బైక్‌పై నంద్యాలకు బయలుదేరారు. ఆళ్లగడ్డ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా జమ్మలమడుగు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రావడంతో సైడు ఇచ్చే క్రమంలో పక్కనే రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్నలపైకి పోవడంతో అదుపు తప్పి కిందపడ్డారు. కిందపడ్డ విజయలక్ష్మీపై ఆర్టీసీ బస్సుటైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

గోస్పాడు: గుండెపోటు లేదా అత్యవసర పరిస్థితుల్లో ప్రాణ రక్షణకు అత్యంత కీలకమైన సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెససిటేషన్) విధానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మదనమోహన్ అన్నారు. మంగళవారం కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ డాక్టర్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జాతీయ సీపీఆర్ అవగాహన వారోత్సవాన్ని అక్టోబర్ 13 నుంచి 17వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుండెపోటు సంభవించినప్పుడు గుండె ఆగిపోవడం, స్పృహ కోల్పోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ విధానం ప్రాణ రక్షణకు అత్యంత అవసరమని చెప్పారు. గుండెపోటు వచ్చిన నిమిషాల్లోనే సీపీఆర్ చేస్తే జీవితావకాశాలు రెండింతలు నుంచి మూడింతల వరకు పెరుగుతాయని తెలిపారు. ప్రతి పౌరుడు ఈ నైపుణ్యాన్ని నేర్చుకోవడం సమాజానికి ఎంతో ఉపయోగకరం అని డాక్టర్ సురేఖ తెలిపారు. సమాజంలో ప్రతి ఇంట్లో, ప్రతి కార్యాలయంలో కనీసం ఒకరు సీపీఆర్ నేర్చుకుంటే, ఒక ప్రాణ రక్షకుడు మన చుట్టుపక్కల ఉంటాడని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో సమయానికి సీపీఆర్ చేయడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడిన ఉదాహరణలు ఉన్నాయని చెప్పారు. తరువాత సీపీఆర్ ప్రదర్శనలు, పోస్టర్ ఎగ్జిబిషన్, ప్రమాణ స్వీకారం, అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, డాక్టర్లు విజయకుమారి, నిరంజన్, మెడిసిన్ విద్యార్థులు పాల్గొన్నారు.

శనగల పంపిణీ ప్రారంభం



శనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్న రైతు సేవాకేంద్రం సిబ్బంది

జూపాడుబంగ్లా: రబీసీజన్‌కు అవసరమైన శనగలను రైతుసేవా కేంద్రాల్లో రైతులకు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని పారుమంచాల, తర్తూరు, మండ్లెం, తూడిచెర్ల, పి.లింగాపురం, తరిగోపుల, తాటిపాడు తదితర గ్రామాల్లో శనగ సాధారణ సాగు విస్తీర్ణం 1,642హెక్టార్లు కాగా 2,600క్వింటాళ్ల శనగలు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపగా మండలానికి కేవలం 300క్వింటాళ్ల జేజీ11 రకం శనగ విత్తనాలు మంజూరైనట్లు ఏఓ తెలిపారు. మంజూరైన విత్తనాలను పారుమంచాల, తర్తూరు, తూడిచెర్ల, తదితర గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో 25శాతం రాయితీపై క్వింటం శనగ విత్తనాలు రూ.5,850ల చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు వారి ఆధార్‌కార్డు, పట్టాపాసుపుస్తకం, సెల్‌ఫోన్ తీసుకెళ్లి రాయితీ శనగ విత్తనాలు తీసుకెళ్లవచ్చన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బండి ఆత్మకూరు: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జగన్మోహన్ ప్రజలకు సూచించారు. మండలంలోని సింగవరం గ్రామంలో మంగళవారం ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మోసపూరిత ఫోన్ కాల్స్ గురించి వివరించారు. తెలియని లింకులు ఓపెన్ చేయవద్దని, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోరాదని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రంలో 'రాజకీయ ప్రచారం'

శ్రీశైలంటెంపుల్: పరమ పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో రాజకీయ ప్రచారాలు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. శ్రీశైల దేవస్థానానికి ధర్మకర్తగా జనసేన పార్టీ నుంచి దేవకీ వెంకటేశ్వర్లు నియామకమయ్యారు. ఆయన వాసవీ సత్ర సముదాయాలకు అధ్యక్షుడిగా ఉన్నారు. అయితే సోమవారం జరిగిన ప్రమాణస్వీకారోత్సవానికి దేవకీ వెంకటేశ్వర్లుకు వాసవీసత్ర సముదాయం పేరుతో శుభాకాంక్షలు తెలుపుతూ వాసవీసత్రం ముందు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అందులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలతో పాటు దేవకీ వెంకటేశ్వర్లు జనసేన పార్టీ కండువా మెడలో వేసుకున్న ఫొటో ఉంది. దీనిని చూసిన పలువురు భక్తులు ఆధ్యాత్మిక క్షేత్రంలో రాజకీయాలు ఏంటని పెదవి విరిచారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా హామీ నెరవేర్చాలి



ప్రధాని పర్యటనకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



నందికొట్కూరులో ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

ఆత్మకూరు: రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్రానికి చట్టబద్ధంగా ఇచ్చిన ప్రత్యేక హోదా, వెనకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ హామీలను నెరవేర్చాలని సీపీఎం నాయకులు రామ్‌నాయక్, మాబాషా డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా పలు హామీలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఒక్క హామీ కూడా నెరవేర్చ లేదన్నారు. ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్ర పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం అభివృద్ధి చెందడం లేదన్నారు. రాయలసీమతో పాటు వెనకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

ప్రధాని మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ పట్టణంలోని గౌడ్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మోదీ పర్యటనను తాము వ్యతిరేకిస్తున్నామని సీపీఐ నాయకుడు ప్రతాప్ అన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటశివుడు, సురేష్, చాంద్‌బాషా, లాలు, జాకీర్, రజితమ్మ, ముర్తుజా, మాణిక్యమ్మ, రాణెమ్మ, శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- నందికొట్కూరు: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని వామపక్ష పార్టీల నాయకులు పక్కీర్ సాహెబ్, శ్రీనివాసులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. మంగళవారం పటేల్ సెంటర్‌లో గో బ్యాక్ నరేంద్రమోదీ అంటూ పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు. రాష్ట్రవిభజన సమయంలో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ నేత, ప్రస్తుత ప్రధానమంత్రి మోదీ తాము హామీచ్చారన్నారు. ఉపాధి లేక గ్రామీణ యువత ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తుంటే జీఎస్టీ తగ్గించామంటూ సంబరాలు చేసుకోండని ప్రధాని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.
- నందికొట్కూరు: అధికారం కోసం సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి తాకట్టు పెట్టారని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మద్రిస్వామి ధ్వజమెత్తారు. ఓ ప్రైవేట్ భవనంలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో మోదీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండానే రాష్ట్రానికి రావడం తగదన్నారు.
- బండి ఆత్మకూరు: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించి, విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయకపోవడం రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేసినట్లే అని, ప్రధాని పర్యటన కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే అని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామచంద్రుడు, సీఐటీయూ నాయకులు డేవిడ్, రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కుళాయిస్వామి పాల్గొన్నారు.
- మహానంది: ఆంధ్రప్రదేశ్‌లో రైతులు, పేదలను పట్టించుకోని ప్రధానమంత్రి మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గోబ్యాక్ అంటూ రైతు సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సోమన్న, దస్తగిరి, గురుమూర్తి తదితరులు మహానందిలో మంగళవారం మోదీ గోబ్యాక్ కరపత్రాలతో నిరసన తెలిపారు.
- శ్రీశైలంప్రాజెక్ట్: విభజన హామీలు అమలు చేయని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనల వల్ల ఒరిగేదేమీ లేదని సీపీఐ మండల కార్యదర్శి పి.పులిరాజు విమర్శించారు. మంగళవారం శాంతియుతంగా నిరసన తెలపడానికి వెళ్తున్న సీపీఐ కార్యకర్తలను పోలీసులు పార్టీ ఆఫీసులో నిర్బంధించడం తగదన్నారు.